ప్రజాశక్తి

సోమవారం 18 మార్చి 2024

5

పార్వతీపురం మన్యం

కలెక్టరేట్‌లో కంట్రోల్ ఏర్పాటు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సాధారణ ఎన్నికల దృష్ట్యా కంట్రోల్ రూం (సహాయక కేంద్రాలు) ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికలు -2024 సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళి తక్షణం అమల్లోకి వచ్చిందన్నారు. కలెక్టరేట్‌లో ప్రజలు సంబంధిత ఫిర్యాదులు, సమాచారం అందించవచ్చని ఆయన వివరించారు. దీన్ని జిల్లాలో గల యావన్మంది ప్రజాప్రతినిధులు, ఓటర్లు, ప్రజానీకం గమనించాలని సూచించారు.

కంట్రోల్ రూం (సహాయక కేంద్రం) ఫోన్ నెంబర్లు :

కలెక్టర్ వారి కార్యాలయం, 08963-796126, 08963-293046

సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం :8977519101

తగ్గారా..? తగ్గించారా..?

ఎమ్‌పి, ఎమ్మెల్యే టిక్కెట్లకు నోచని చిన్న శ్రీను

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్‌పిగా పోటీచేయాలని ఎంతో ఆశగా, ఆతృతగా ఎదురు చూసిన జిల్లా పరిషత్తు ఛైర్మన్, వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కల నెరవేరలేదు. చివరి క్షణాల్లో శ్రీనే వెనక్కి తగ్గి పోయారా? లేక పార్టీనే వెనక్కి తగ్గించిందా? ఇదీ ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న చర్చ. ఆయన అనుయాయులు, అభిమానులు మాత్రం పార్టీ అధిష్టానం వైఖరిని జీర్ణించుకోలేకపోతున్నారు. తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒకనాడు మంత్రి బొత్స సత్యనారాయణ... నేడు అదే స్థాయిలో చిన్న శ్రీను అన్నట్టుగా గడిచిన దశాబ్ద కాలంలో వైసిపిని ఒంటిచేత్తో నడిపించారు. బొత్స జోక్యం ఉన్నా లేకపోయినా ఓవైపు నాయకత్వాన్ని సమన్వయం చేస్తూ, మరోవైపు పార్టీని ముందుకు నడిపిస్తూ ప్రత్యేక స్థానాన్ని, గుర్తింపును ఏర్పాటు చేసుకున్నారు. అందుకు తగ్గట్టే గత ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని స్థానాలు వైసిపికి వచ్చాయి. నాటి విజయంలో చిన్న శ్రీను పాత్ర తక్కువేం కాదు. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పార్టీ కార్యక్రమాల్లో సైతం చిన్న శ్రీనుకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలోనే 2024లో అసెంబ్లీ లేదా పార్లమెంట్‌కు వెళ్లాలనే ఆశ అడుగడుగునా కనిపించేది. ఈసారి ఎలాగైనా చిన్న శ్రీను ఎమ్‌పి లేదా ఎమ్మెల్యేగా పోటీచేస్తారనే చాలా మంది రాజకీయాలకు అతీతమైన వ్యక్తులు సైతం భావించారు. అనుకున్నట్టే రెండు నెలల క్రితానికి బొబ్బిలి లేదా ఎచ్చెర్ల నుంచి రంగంలో దింపుతారనే ప్రచారం గట్టిగానే నడిచింది. అందుకు సామాజిక సమీకరణాలు అనుకూలించకపోవడంతో విజయనగరం ఎమ్‌పిగా పోటీకి దిగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషణలు వచ్చాయి. ఒకానొక దశలో విశాఖపట్నం ఎమ్‌పిగా బొత్స ఝాన్సీలక్ష్మిని ప్రకటించినప్పుడే విజయనగరం ఎమ్‌పి టికెట్ చిన్న శ్రీనుకు ఖాయమైందని కూడా చర్చ నడిచింది. సిట్టింగ్ ఎమ్‌పి బెల్లానకు ప్రత్యామ్నాయం చూపుతారని కూడా ప్రచారం జరిగింది. కానీ, శనివారం ప్రకటించిన జాబితాలో చిన్న శ్రీను పేరు కనిపించలేదు.

చిన్న శ్రీనుకు టికెట్ లేకుండా చేయడం కోసం మంత్రి బొత్స తన రాజకీయ పలుకుబడితో సిట్టింగులను యథాతథంగా కొనసాగించేందుకు అధిష్టానాన్ని ఒప్పించారని ప్రచారం ముమ్మరంగా నడుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో శ్రీనుకు ఎమ్‌పి లేదా ఎమ్మెల్యే టికెట్ ఇస్తే, ప్రస్తుతం ఉన్న జిల్లా పరిషత్తు ఛైర్మన్ పదవికి ఎన్నికలకు ముందుగానే రాజీనామా చేయించాలనే మెలిక కూడా పెట్టారట. జిల్లా అడ్మినిస్ట్రేషన్, రాజకీయాలను శాసించేందుకు అనువుగా ఉన్న జెడ్‌పి పీఠాన్ని వదులుకునేందుకు ఇష్టం లేక చిన్న శ్రీనే వెనక్కి తగ్గారని చర్చ నడుస్తోంది. పార్టీ జిల్లా సమన్వయకర్తగా ప్రస్తుత ఎన్నికల్లో అత్యంత కీలకంగా పనిచేయాల్సింది శ్రీనే. కాబట్టి, పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ పదవి ఇచ్చి పార్టీ సంతృప్తి పర్చిందని పలువురు విశ్లేషిస్తున్నారు. పోటీకి అధిష్టానం అవకాశం ఇవ్వకపోవడం, అందుకు జిల్లాకు చెందిన నేత అడ్డపడ్డారన్న ఊహాగానాల నేపథ్యంలో ఎన్నికల్లో శ్రీను పాత్ర ఎలా ఉంటుందో అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

66 కేంద్రాల్లో నిర్వహణ ● హాజరు కానున్న 11,198 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఈ నెల 18 నుంచి 30 తేదీ జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి 11,198 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 5124, బాలికలు 5410 మంది ఉండగా, గతంలో పరీక్ష తప్పిన వారు 664 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. 66 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలి. అరగంట పాటు అవకాశం ఇస్తారు. ఇదే పనిగా రోజు ఒకే విద్యార్థి ఆలస్యంగా వస్తే తర్వాత వారికి పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. కొన్ని కారణాల రీత్యా ఆలస్యంగా వస్తే 10 గంటల వరకు అనుమతించేందుకు అవకాశం ఉంటుంది.

ఇప్పటికే విద్యుత్, వైద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారంతో పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. విద్యార్థుల హాల్ టికెట్ మీద హెచ్ఎం సంతకం తప్పనిసరిగా ఉండాలి. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదు. పరీక్ష నిర్వహణకు 518 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితోపాటు తనిఖీ బృందాలు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా సమయానికి ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉంచుతున్నారు. హాల్ టికెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారు.

పరీక్షలకు సిద్ధమైన కేంద్రం

పరీక్ష నిర్వహణకు సర్వం సిద్ధం

సోమవారం నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసుకునేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలి. సమయానికి హాజరు కావాలి.

- పగడాలమ్మ, డిఇఒ

ఎన్నికల కోడ్ అమలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు/పాలకొండ/కురుపాం

నియోజకవర్గంలో రానున్న ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళిని అమలు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పట్టణంలో ఇఆర్‌ఒలు ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, డిఎస్‌పి మురళీధర్, పాలకొండ, కురుపాంలో ఆర్‌డిఒ ఎ.వెంకటరమణతో కలిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పరిశీలించారు. మున్సిపాలిటీలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఉన్న హోర్డింగులను ఏ మాత్రము ఆలస్యం చేయకుండా తక్షణమే తొలగించాలని ఆయన ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తతంగా పర్యటిస్తూ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సి-విజిల్ లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుండి అందే ఫిర్యాదులపై అదే రోజు, మీడియాలో ప్రచురితమయ్యే ఫిర్యాదులపైన ఇతర ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఎటువంటి అలసత్వం వహించారని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్లు పి.ప్రసన్నవాణి, ఎస్.సర్వేశ్వరరావు, తహశీల్దార్ సింహాచలం ఉన్నారు.

సాలూరులో పర్యటిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పిఒ విష్ణుచరణ్

ఎన్నికల నియమావళి విధిగా పాటించాలి

పార్వతీపురంరూరల్ : సాధారణ ఎన్నికల కోడ్ ప్రకటించడం జరిగిందని, ఎన్నికల నియమావళి విధిగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్నారు. జిల్లా కలెక్టర్లతో ప్రధాన ఎన్నికల అధికారి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు తదితర ప్రచార సామగ్రి తక్షణం తొలగించాలని ఆదేశించారు. సి విజిల్ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి అమల్లో లక్ష్యం చేయరాదని ఆయన అన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు పక్కాగా తయారు చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో రిటర్నింగ్ అధికారులు - పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, ఎ.వెంకట రమణ, ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఎస్‌డిసి ఆర్ సూర్యనారాయణ, నోడల్ అధికారులు - జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా ఉద్యాన అధికారి కెఎస్ వరప్రసాద్, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామ్మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో గ్రూపులు కలిసినట్టా... కలవనట్టా?

సాలూరు నియోజకవర్గంలో రక్తి కట్టించే రాజకీయం

ప్రజాశక్తి -మక్కువ

సాలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో ఏర్పడ్డ గ్రూపులు ఎన్నికలు సమీపిస్తున్నా ఇంకా ఒకేతాటిపైకి వచ్చాయన్న సందర్భమైతే ఇప్పటికీ దరిదాపుల్లో కనిపించలేనట్లేనని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్టీ అధిష్టానం, పరిశీలకులు వచ్చేటప్పుడు అంతా కలిసినట్టుగా అక్కడికి వచ్చే పరిశీలకులకు కళ్లకు గంతలు కట్టేలా మహానటుడు ఎన్టీఆర్ను మరిపించేలా ఒకరికి ఒకరు పోటీగా నటిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పార్టీ విజయం కోసం ఏ ఒక్కరూ తాపత్రయం పడడం లేదన్నని పలువురు అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మక్కువ మండలంలో నువ్వా నేనా అన్న రీతిలో కొనసాగుతున్న గ్రూపుల వైరం మిగిలిన సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాలపై కూడా ఈ ప్రభావం పడనుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. గుమ్మడి సంధ్యారాణికి సాలూరు నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ ఇప్పటికే పార్టీ ప్రకటించింది. ఈ తరుణంలో అందరినీ కలుపుకునేలా ఓ మెట్టు దిగి గెలుపు కోసం తాపత్రయ పడాల్సిన పరిస్థితి సంధ్యారాణిపై ఉందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఆ దిశగా ప్రయత్నించకుండా ఆమెను కొంతమంది నిలువరిస్తున్నారనే ఓవైపు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అలాంటి వారిని నిలువరించి ముందుకు వెళ్లేందుకు ఆమె కూడా సాహసం చేయటం లేదన్న ఆరోపణలు పార్టీ శ్రేణులు చేస్తున్నాయి. ఇటీవల మక్కువ మండలంలో ఆమె వ్యతిరేక గ్రూపుపై పెంట తిరుపతిరావుకు సంబంధించిన కొంతమంది కలిసే ప్రయత్నం చేశారు. అయితే వారి సూచనలు మాత్రం పట్టించుకోకుండా ఆమె పని ఆమె చేసుకుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీన్ని మరింత బలపరిచేలా ఇటీవల మావుడి ప్రసాదరావు నాయుడు ఇంటి వద్ద తన అనుకూలులతో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడిన పార్టీ సభ్యుల తీరును ఒకింత పెంట తిరుపతిరావు గ్రూపు ఆక్షేపిస్తుంది. తిరుపతిరావు గ్రూపు చేర్చుకుంటే ఒకంత నష్టమే అన్న రీతిగా అక్కడ మాట్లాడే వారి ప్రసంగాలు ఉన్నప్పటికీ వాటిని కూడా సంధ్యారాణి ఖండించకపోవడం చూస్తుంటే కాగలకార్యం గాంధర్వులతో చేయించిన రీతిగా ఉందని పలువురు పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఇటీవల శంబర గ్రామంలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ కార్యక్రమానికి స్థానిక ఎంపిటిసి పోలినాయుడును ఆహ్వానించినా పెంట తిరుపతిరావును పిలవకపోవడంతో ఆయన హాజరు కాలేదు. దీనిపై ఆయన బహిరంగ ప్రకటన కూడా చేశారు. అలాగే ఆమె గ్రూపులో కొనసాగుతున్న మావుడి ప్రసాదరావు నాయుడుకు కూడా సముచిత గౌరవం ఇవ్వడం లేదని పార్టీలో కొంతమంది అభిప్రాయపడుతున్నారు. గతంలో ప్రసాదరావునాయుడుతో ఉన్న సంబంధాల కారణంగా శంబరలో కొందరు పార్టీలో చేరినప్పటికీ వారంతా మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో చేరినట్లు పత్రికలకు తెలపడం కూడా మరింత మనస్పర్ధలకు దారితీస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సాలూరు నియోజకవర్గం నాయకులు సమన్వయంతో మెలగి టిడిపి విజయానికి కృషి చేయాలని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.చేయాలని పలువురు పార్టీ శ్రేణులు అభిమానులు కోరుతున్నారు.

శంబరలో జరిగిన సభలో పాల్గొన్న సంధ్యారాణి గ్రూపు నాయకులు

రెండోసారి తలపడనున్న గిరిజన నేతలు

ప్రజాశక్తి - సాలూరు

సాధారణ, అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, ప్రధాన పార్టీల అభ్యర్థులెవరో తేలిపోవడంతో నియోజకవర్గంలో ఎన్నికల వేడి రాజుకుంది. టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణిని ఇప్పటికే ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. సంధ్యారాణి మొదటి సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా 1999 ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి ఆర్‌పి భంజ్‌దేవ్ చేతిలో ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రాజన్నదొర చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు మళ్లీ టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. ఆమె 2014 ఎన్నికల్లో అరుకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సంధ్యారాణి విద్యావంతురాలు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో ఆమెకు టిడిపి అధిష్టానం ఎమ్మెల్సీ గా అవకాశం ఇచ్చింది. ప్రత్యక్ష ఎన్నికల్లో ఆమె ఇంతవరకు గెలిచిన సందర్భాలు లేవు. 2024 ఎన్నికల్లో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదబొండపల్లిని ఆదివారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సందర్శించారు. సర్పంచ్ సవరాపు తవుడమ్మ రాజారావు, వైసిపి సీనియర్ నాయకులు చందక శివాజీ, ఎఎంసి డైరెక్టర్ అల్లం వెంకట్రావు, నాయకులు వంగపండు కృష్ణమూర్తి, తదితరులతో ప్రస్తుత రాజకీయాలు చర్చించారు.ు నాయుడు, మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ గుంట్రెడ్డి దామోదర్ రావు, స్కూల్ కమిటీ ఛైర్మన్ పప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి - కురుపాం

ఎన్నికల కోడ్ రావడంతో దాన్ని అమలు చేసే పనిలో నియోజవర్గం కేంద్రమైన కురుపాం మేజర్ పంచాయతీలో రెవెన్యూ పంచాయతీ సిబ్బంది ఆదివారం నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, విఆర్‌ఒ మహేంద్ర తమ సిబ్బందితో పలు దగ్గర్లో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీల హోర్డింగులను, గోడలపై అతికించిన పార్టీల స్టిక్కర్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని చినబోగిలి, సీతానగరంలో రాజకీయ పార్టీల ఫ్లెక్షులను ఆర్‌డిఒ కె.హేమలత దగ్గరుండి సిబ్బందిచే తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో గ్రామాల్లోనూ ప్రభుత్వ కార్యాలయంలో ఎటువంటి రాజకీయ పార్టీలకు చెందిన గోడ పత్రికలు ఉండకూడదని, నిబంధన ప్రకారం తొలగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలు పట్టని అధికార, ప్రతిపక్షాలు

ఎలక్టోరల్ బాండ్ల డబ్బులు పంచి ప్రజలను మోసగిస్తున్న పార్టీలు : సిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల సమస్యలు పట్టని వైసిపి, టిడిపి, బిజెపి, జనసేనలు ఎన్నికల్లో కార్పొరేట్లు ఇచ్చిన ఎలక్టోరల్ బాండ్ల డబ్బులు పంచి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. డబ్బులు పంచకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలవడానికి పై పార్టీలు సిద్ధమా అని ప్రశ్నించారు. వీటికి భిన్నంగా సిపిఎం ప్రజా పోరాటాలు చేపట్టి ప్రజల వద్ద నిధులు సేకరించి ఎన్నికల్లో పోటీ చేస్తూ ప్రజాసేవకు, పోరాటాలకు సిద్ధమవుతున్న సిపిఎంను గెలిపించాలని కోరారు. విశ్వసనీయత, పారదర్శకత, నీతి నిజాయితీ గురించి పదే పదే ప్రస్తావించే జగన్మోహన్ రెడ్డి బాండ్ల ద్వారా అందిన నిధుల విషయాన్ని ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్ల విధానం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం వాక్ స్వాతంత్ర్యాన్ని, సమాచార హక్కును ఉల్లంఘిస్తోందని సుప్రీం ధర్మాసనం స్పష్టంగా తన తీర్పులో వెల్లడించిందని తెలిపారు. ఈ బాండ్ల వ్యవహారం అతి పెద్ద స్కామ్ అన్నారు. మొత్తం బాండ్లలో సగం రూ.6,565 కోట్లు బిజెపికే అందాయన్నారు. అలాగే వైసిపికి రూ.337 కోట్లు, టిడిపికి రూ.218.88 కోట్లు, జనసేనకు రూ.21 కోట్లు కార్పొరేట్ సంస్థల ద్వారా అందాయని ఎన్నికల కమిషన్ ప్రకటించిన జాబితాలో ఉన్నాయని తెలిపారు. దీనికి ఆ పార్టీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవినీతి, స్కాములు, బడ్జెట్ పాలిటిక్స్ గురించి మాట్లాడే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎలక్టోరల్ బాండ్లపై చర్చ జరుగుతుంటే వైసిపి, టిడిపి, జనసేన తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ పార్టీల రంగుల జెండా వేరైనా ఎజెండా మాత్రం ఒక్కటేనని దుయ్యబట్టారు. రాజకీయాలను డబ్బులు ఏ స్థాయిలో ప్రభావితం చేస్తాయో ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల రద్దు చేయాలని మొదట్నుంచి సిపిఎం పోరాడుతుందన్నారు. సుప్రీంలో కేసు వేసి చివరివరకు పోరాడిందన్నారు. ఈ బాండ్లు తీసుకోని పార్టీలు వామపక్షాలు, సిపిఎం(ఐ) మాత్రమేనని అన్నారు. ప్రజాస్వామ్యానికి సమాచారం చాలా అవసరమని, ఎలక్టోరల్ బాండ్లు చట్టబద్ధ క్విడ్ ప్రోకో అని విమర్శించారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఏ పెట్టుబడిదారుడు, ఏ కంపెనీ ఎంత మొత్తం ఇచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

కురుపాం : సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ఎర్రజెండాల అభ్యర్థులను గెలిపించాలి

కురుపాం : గిరిజనులు, రైతులు, దళితులు, వృత్తి దారుల పక్షాన, ప్రజల హక్కుల కోసం ఉద్యమాలు, పోరాటాలు చేసే ఎర్రజెండాల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని పొరండంగూడ, తిత్తిరి అంటిజోల తదితర గ్రామాల్లో గిరిజనులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులకు ఓటు వేసి చట్ట సభలకు పంపించాలని కోరారు. రాష్ట్రానికి, దేశానికి ద్రోహం చేసిన ఎన్నికల బాండ్లు పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసిన, అటవీ హక్కులు, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రజలపై భారాలు వేస్తున్న బిజెపిని, రాష్ట్రంలో దాన్ని బలపరుస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొరాడ ఈశ్వర రావు, బిడ్డికఅనిల్ కుమార్, మండంగి ఇండియా, ఆరిక రంగారావు వి.వాసుదేవరావు పాల్గొన్నారు.

కురుపాంలో మహిళా ఓటర్లే కీలకం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే 5413 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,92,636 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 93,592, మహిళా ఓటర్లు 99,005, థర్డ్ జెండర్ 39 మంది ఓటర్లు ఉన్నారు. కురుపాం మండలంలో 16825 మంది పురుష ఓటర్లు ఉండగా 18054 మహిళా ఓటర్లు, 12 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో 16068 మంది పురుష ఓటర్లు 18812 మంది, మహిళా ఓటర్లు, 16 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జియ్యమ్మవలస మండలంలో 21,721 మంది పురుషులు, 21978 మంది మహిళా ఓటర్లు 8 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. కొమరాడ మండలంలో 19,717 మంది పురుష ఓటర్లు ఉండగా 21,057 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్ ముగ్గురు ఉన్నారు. గరుగుబిల్లి మండలంలో 19,261 మంది పురుషులు, 19,104 మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ థర్డ్ జెండర్లు లేరు.

ఫలించిన యుటిఎఫ్ పోరాటం

పలువురు సిఆర్‌టిల క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

యుటిఎఫ్ దశాబ్దాల కాలంగా చేసిన అనేక పోరాటాల ఫలితంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు కాంట్రాక్టు ఉపాధ్యాయులకు (సిఆర్‌టి) రెగ్యులరైజ్ అయ్యింది. 2014 నుంచి నేటి వరకూ రూ.5,500 చాలీచాలని జీతాలతో సిఆర్‌టిలు విధులు నిర్వహిస్తూ వచ్చారు. వీరికి గౌరవ వేతనం, రెగ్యులరైజేషన్ కోసం యుటిఎఫ్ ఆధ్వర్యాన అర్ధనగ్న ప్రదర్శనలు, మోకాల నిరసనలు, పికిటింగులు వంటి ఎన్నో పోరాటాలు చేయడం జరిగింది. ఈ పోరాటాల ఫలితంగా అంచలంచెలుగా రూ.5,500 నుంచి రూ.7500, అక్కడ నుంచి 2014లో వారి జీవితం రూ.12000, అలాగే 2016లో కనీస పనికి కనీస వేతనం అనగా ప్రస్తుత పిఆర్‌సిలో రూ.44,570 సాధించడం జరిగింది. అలాగే వారి ప్రధాన డిమాండ్ అయిన రెగ్యులరైజేషన్ నేటికి నెరవేరింది. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా కార్యవర్గానికి సిఆర్‌టిలు అభినందనలు తెలిపారు. అయితే కొంతమంది సిఆర్‌టిలనే రెగ్యులరైజ్ చేయడం సమంజసం కాదని, మిగిలిన వారందర్నీ రెగ్యులర్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రెగ్యులర్ పత్రాన్ని సిఆర్‌టికి అందజేస్తున్న అధికారులు

4 నుంచి గుమ్మలక్ష్మీపురంలో యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో గల ఉమా సహిత కైలాస నాధ ఆలయ 41వ వార్షికోత్సవ సందర్భంగా ఏప్రిల్ 4 నుంచి 8 వరకు యాత్ర నిర్వహిస్తున్నట్లు సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. ఈ యాత్ర సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు.

శ్రమదానంతో కాలువల్లో పూడికలు తొలగిస్తున్న గ్రామస్తులు

వీధులను శుభ్రం చేసుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలోనే పారిశుధ్య పనులు చేపట్టాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండలంలోని రేగులపాడు పంచాయతీలో గల బొడ్లపాడు గ్రామస్తులంతా ఏకమయ్యారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలోని అన్ని వీధుల్లో మురికి కాలువల్లో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. గత కొంతకాలం నుంచి మురికి కాలువలను చెత్తను తొలగించకపోవడంతో మురికి నీటి వద్ద దోమలు స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, వీటిని గుర్తించి పెద్దలు, యువత, గ్రామస్తులు నడుం బిగించి కాలువలో చెత్తను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్, పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

22న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లి మండల పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రామంలోని రామమందిరం పునః ప్రతిష్ట సందర్భంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొంటారని, కావున రావుపల్లి, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సిర్లి యాత్ర

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సీతానగరం దేవరవీధి, అంటిపేట సిర్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ గుడి దగ్గర గుడ్లు, బియ్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్రలో ఎటువంటి అవతవక సంఘటనలు జరగకుండా ఎస్సై ఎం రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షులు రామునాయుడు

ఎన్నికల హామీలను అమలు చేయాలి : ఆపస్

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర సహాధ్యక్షులు జె.రామునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మన్యం జిల్లా అధ్యక్షులు సాదాపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన వాటా మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అక్రమ బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిఎస్ స్థానంలో ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నాలి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చినంకలాంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

చినంకలాంలో బాబు ష్యూరిటీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినంకలాంలో బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ఆ గ్రామ పెద్దలు బెహర సురేష్, బోను సత్యనారాయణ, శ్రీనివాసరావు, పోలినాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఈ గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి. వీరందరికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మండల పార్టీ అధ్యక్షుడు పెంట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాల్ నాయుడు ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు వాకాడ పారినాయుడు, సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, యూనిట్ ఇన్చార్జి రెడ్డి భీమాశంకరరావు, యువ నాయకులు నాగరాజు, ధనంజయనాయుడు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లి ఆలయం ప్రారంభం

సాలూరు: పట్టణంలోని శ్రీ కోదండరామ కల్యాణమండపం సమీపంలో కొత్తగా నిర్మించిన కొత్తమ్మ తల్లి ఆలయం ఆదివారం ప్రారంభించారు. కొత్తమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించారు. వేద మంత్రోచ్చారణ మధ్య ఆలయం కమిటీ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. మూడురోజుల పాటు ఆలయం లో ప్రత్యేక పూజలు, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కరువు

తరగతి గదుల్లో వసతులు శూన్యం

ఆటోలే ఆధారం విద్యార్థులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఈనెల 18నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నత స్థాయి అధికారులు పదేపదే మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ వీరి నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇందుకు మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల దుస్థితి నిదర్శనం.

స్థానిక జిల్లా పరిషత్తు బాలుర, బాలిక ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఈ కేంద్రాల్లో ఈ ఏడాది 640మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక్కొక్క కేంద్రంలో ఏడు, ఎనిమిది రూములు కేటాయించగా, కొన్ని రూముల్లో ఫ్యాన్లు తిరిగితే లైట్లు వెలగవు, మరికొన్ని రూముల్లో లైట్ వెలిగితే ఫ్యానులు తిరగని పరిస్థితి. కిటికీలో నుంచి ప్రకృతి నుంచి వచ్చే వెలుగులోనే విద్యార్థులు పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో ఇన్చార్జి డిఆర్‌ఒ జి.ఆదికేశవనాయుడు సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి సమన్వయంతో పనిచేస్తే పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అవి ఎక్కడా కనిపించడం లేదు. వీటికి అధికారులు నిర్లక్ష్యమే కారణమని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

రవాణా సౌకర్యాల్లేక ఆటోలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఫ్యాన్లు, లైట్లు లేని వీరఘట్టం జెడ్‌పి ఉన్నత బాలుర పాఠశాల

ఆటోలే ఆధారం

మండలంలోని గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, నీలానగరం, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉండటంతో బస్సు సౌకర్యం లేక విద్యార్థుల ఆటోలపై ఆధారపడి అనేక అవస్థలుపడుతూ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటు విద్యార్థులు, అటు విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పరీక్షా కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కురుపాం

పదో తరగతి పరీక్షలకు 686 మంది విద్యార్థులు మండలంలో అన్ని పాఠశాలల నుంచి హాజరవుతున్నారని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని టెన్త్ పరీక్షలు మండలం కేంద్రంలో ఎపి మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు జరగ్గా, ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఒక కేంద్రంగా మొత్తం మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తగా రాయాలని విద్యాశాఖ తరపున విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

జియ్యమ్మవలస : మండలంలోని జియ్యమ్మవలస, బిజెపురం, చినమేరంగి, పెదమేరంగి, పెదబుడ్డిడి, చినకుదమ, పిప్పలభద్ర, జియ్యమ్మవలస, చినమేరంగి కస్తూరిబా ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు జియ్యమ్మవలస, రావాడరామభద్రపురం, వనిజ గిరిజన బాలుర వసతిగృహాలు, టికె జమ్ము గిరిజన బాలికల ఉన్నత పాఠశాల, పెదమేరంగి కూడల్లో గల సత్య కైలాస్, తిరుమల సాయి పాఠశాల నుంచి విద్యార్థులంతా టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. అయితే వీరికి జియ్యమ్మ వలస, చినమేరంగి, రావివలస, టిక్కబాయ్, రేగుడి పరీక్ష కేంద్రాలుగా నిర్వహించనున్నారని ఎంఇఒ ఎన్.నాగభూషణరావు మండలం లోని 254 మంది బాలురు, 240 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

గరుగుబిల్లి : పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒ ఎన్.నాగభూషణరావు వెల్లడించారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలు గరుగుబిల్లి, రావివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలతో పాటు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల, పాఠశాలలో జరగ నున్నాయన్నారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 620 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవు తున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు.

మూలబిన్నిడిలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు అవినాష్

వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న సాధారణ ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే, అరుకు పార్లమెంట్ ఎంపి స్థానాలకు వామపక్షాల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం నాయకులు గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. మండలంలోని మూల బిన్నిడి, చాపరాయి బిన్నిడి, గొరడ, వనకాబడి, దుడ్డు ఖల్లు గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి పాలనతో గిరిజనుల హక్కులు, చట్టాలకు పూర్తిగా రక్షణ కరువైందని తెలిపారు. జిఒ 3ను ఎత్తివేశారని తెలిపారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి కరువైంద న్నారు. గిరిజనుల పక్షాన ఉండి నిరంతరం పోరాడుతున్న సిపిఎం, వామపక్ష అభ్యర్థు లను రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే గిరిజనుల హక్కులు, చట్టాలను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పువ్వల తిరుపతి రావు ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలు ఎక్కడ?

ప్రజాశక్తి-పాలకొండ

ఈ నెల 16న నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాజకీయ నాయకుల ఫొటోలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లో తొలగించడంతో పాటు, ప్రభుత్వ పథకాలు పంపిణీలో కూడా ఎక్కడా ముఖ్యమంత్రి, మంత్రుల ఫోటోలు కనిపించకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ పాలకొండలో రేషన్ పంపిణీ వాహనాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటో ఇంకా దర్శనమిస్తుంది. ముఖ్యమంత్రి ఫోటో కనిపించకుండా ఉంచాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులకు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చూపుతున్నారు.

వీరఘట్టంలో ఉన్న పోస్టర్లు

ఎండిఎం వాహనంపై ఇంకా తొలగించని ముఖ్యమంత్రి ఫొటో

వీరఘట్టం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారో వీటిని చూస్తే అర్ధం చేసుకోవచ్చు. మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీకి దగ్గర్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అరకు పార్లమెంటరీ అభ్యర్థి కొత్తపల్లి గీత పోస్టర్ కనిపించలేదా? అంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అలాగే రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, పట్టాదారు పుస్తకాలు, కుల ధ్రువపత్రాలు, తదితరమైన వాటిపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖచిత్రం ఉంటుందని, అధికారులు వీటిపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

హేమాహేమీలకు టికెట్లు కరువు

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిలో అనూహ్య మార్పులు కనిపిస్తున్నాయి. కాకలు తీరిన రాజకీయ నాయకులు ఎన్నికల్లో పోటీకి దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజు కోసం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఏకంగా పోటీ నుంచే వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావు ఈ ఎన్నికల్లో సీటు కోసం ఉత్కంఠగా ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు వృద్ధాప్యంతో ఏకంగా రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా కాకలు తీరిన రాజకీయ నాయకులను 2024 సార్వత్రిక ఎన్నికలు రాజకీయాల నుంచి దూరం చేస్తున్నాయా? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది.



అశోక్ | పతివాడ

- అయోమయంలో కళావెంకటరావు భవిష్యత్తు
- కుమార్తె కోసం పక్కకు తప్పకోవాల్సిన స్థితిలో అశోక్
- వృద్ధాప్యంతో రాజకీయాలకు దూరమైన పతివాడ



కళావెంకటరావు | సుజయ్‌కృష్ణ | లలితకుమారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అశోక్ గజపతి రాజు.. టిడిపి ఆవిర్భావం నుంచీ ఆ పార్టీలో అత్యంత కీలకంగా ఉన్నారు. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతోపాటు పార్టీలో కీలక స్థానంలో కొనసాగుతున్నారు. కానీ, అశోక్ కుమార్తె అదితి గజపతిరాజుకు విజయనగరం ఎమ్మెల్యే సీటు అడగడం, అందుకు పార్టీ ముందుకు రావడంతో ఆయన అంతటితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కొద్ది రోజుల క్రితం వరకు ఎమ్‌పిగా అశోక్‌ను పంపొచ్చన్న ఊహాగానాలు వ్యక్తమైనా, ఇటీవల కుదిరిన పొత్తులో భాగంగా విజయనగరం లోక్‌సభ స్థానాన్ని బిజెపికి కేటాయించడంతో ఆ ద్వారం దాదాపు మూసేసినట్టే. ఈ నేపథ్యంలో ఈసారి అశోక్ పోటీకి దూరంగానే ఉండాల్సిన పరిస్థితి అనివార్యమైంది.

- నెల్లిమర్లలో టిడిపి కురువృద్ధునిగా ఉన్న పతివాడ నారాయణస్వామి నాయుడును వృద్ధాప్యం వల్ల ఈ సారి పోటీ నుంచి తప్పించారు. దీనికితోడు ఈ స్థానం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ఈ నియోజకవర్గంలో ఎదురులేని నేతగా ఉన్న నారాయణస్వామి నాయుడు వారసులు కూడా ఆయన స్థాయిలో కనిపించడం లేదు.
- జిల్లాల పునర్విభజనలో భాగంగా మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు ప్రస్తుతం మన జిల్లా రాజకీయాలతో ముడిపడి ఉన్నారు. ఆయన నివాసం ఉంటున్న రాజాం నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు కావడంతో మునుపటి మాదిరిగానే శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి పోటీచేసేందుకు తహతహలాడుతున్నారు. ఆయనకు అక్కడ కొంత వ్యతిరేకత ఉండడంతో టికెట్ కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడింది. శ్రీకాకుళం జిల్లాలో చాలా వరకు సీట్లు కేటాయించినప్పటికీ ఎచ్చెర్ల గురించి తేల్చకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వాస్తవానికి వెంకటరావు టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా కూడా పనిచేశారు. అయినా టికెట్ ఇవ్వడానికి పార్టీ ఇంతలా ఆలోచిస్తుండడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎచ్చెర్ల నుంచి వెంకటరావుకు ప్రత్యామ్నాయంగా కలిశెట్టి అప్పలనాయుడు పేరు పరిశీలనలో ఉన్నట్లుగా సమాచారం.
- బొబ్బిలిలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆయన సోదరుడు బేబినాయనకు బొబ్బిలి ఎమ్మెల్యే సీటు కేటాయించడంతో సుజయ్‌కృష్ణ రాజకీయ భవిష్యత్తుకు తాత్కాలికంగా బ్రేకు పడినట్లేనని పలువురు విశ్లేషిస్తున్నారు.
- కొన్ని దశాబ్దాలుగా శృంగవరపుకోట నుంచి టిడిపి అభ్యర్థి అంటే కోళ్ల... కోళ్ల అంటే టిడిపి అభ్యర్థి అన్నట్టుగా ఉండే పరిస్థితి. దీనిని తాజా రాజకీయ సమీకరణాలు తలకిందులు చేసే విధంగా కనిపిస్తున్నాయి. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు కోడలు లలితకుమారి కూడా సీటు కోసం చివరి వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి రాజకీయ నాయకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ స్థానం నుంచి పోటీలో దింపేందుకు యువ నాయకుడు గొంప కృష్ణ (ఎన్‌ఆర్‌ఐ) పేరును పరిశీలిస్తుండడమే ఇందుకు కారణమని సమాచారం.

ఇలా ఇప్పటికే అశోక్, పతివాడ నారాయణస్వామి నాయుడు, సుజయ్‌కృష్ణ రాజకీయ భవిష్యత్తు తాత్కాలికంగా బ్రేకు పడగా, కళావెంకటరావు, లలితకుమారి భవితవ్యం అయోమయ పరిస్థితికి దారితీసింది.

తాగునీటి సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు తాగునీటి సదుపాయం తక్షణమే కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని పెదశాఖ పంచాయతీ జల గ్రామం వద్ద ఆదివారం విలేకరులతో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు ఎం.ప్రసాదు మాట్లాడారు. జల గ్రామంలో 45 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నారని, వీరికి మంచినీరందక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమీప గెడ్డ నుంచి కలుషిత నీరు తెచ్చుకోవడంతో మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలతో బాధపడే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని గతంలో సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేయడం జరిగిందని దీనికి స్పందించి ఆర్డబ్ల్యూఎస్ అధికారులు జల, గుజ్జబడిలో గడిచిన 30 రోజుల క్రితం మంచినీటి బోరు తీశారన్నారు. అయితే ఈ బోరుకు హెడ్ బిగించకపోవడం చూస్తుంటే ఎందుకు తీశారో తెలియని పరిస్థితిలో ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో గెడ్డలోనే కలుషితమైన నీరు తెచ్చుకునే పరిస్థితి ఉందని, కావున వెంటనే రెండు గ్రామాల్లో మంచినీరు బోరుకు హెడ్ బిగించి మంచినీరు సౌకర్యం కల్పించాలని కోరారు. ఐదు వారాలుగా ఉపాధి పనులు చేసినా వేతనం రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి కొరత ఉండడం వల్ల కావున వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని బోరుకు హెడ్ బిగించి మంచినీరివ్వాలని కోరారు. అలాగే పెండింగ్ ఉన్న ఉపాధి వేతనాలు చెల్లించాలని, గ్రామంలో కాలువలు నిర్మించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జగ్గారావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన నాటుసారాను పరిశీలిస్తున్న ఎఎస్‌పి

1502 లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 18 నాటు సారా కేసుల్లో పట్టుబడిన 1502 లీటర్ల నాటు సారాను ఆదివారం పార్వతీపురం ఎఎస్‌పి సునీల్ షరైన్, పట్టణ సిఐ పివివిఎస్ఎన్ కృష్ణారావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఇందులో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

21న జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని గుర్ల తమ్మిరాజుపేటలో ఈనెల 21వతేదిన ఎల్లమ్మ తల్లి జాతర జరుగుతున్న సందర్భంగా మండల స్థాయి పురుషుల వాలీబాల్, జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గుర్ల తమ్మిరాజుపేట అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు చొక్కాకు సన్యాసిరాయుడు, కొండమ్మ దంపతులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు సమన్వయకర్తగా డాక్టర్ పొట్నూరు శ్రీరాములు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన ఉదయం 9 గంటల నుండి మెంటాడ మండల స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు ఉంటాయని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి రూ.6వేలు, 4వేలు, 2వేలు నగుదు బహుమతులు, షీల్డులు అందిస్తామని చెప్పారు.

ఐదోసారి రాజన్నదొరకు సీటు

బాణసంచా కాల్చిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

మాజీ మంత్రి రాజన్నదొరకు ఐదోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు ఖరారు కావడంతో నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందంతో బాణసంచా పేల్చారు. వైసిపి జిల్లా కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆదివారం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. రానున్న ఎన్నికల్లో రాజన్నదొరను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే విజయపథంలో నడిపిస్తాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, వైసిపి నాయకులు గిరి చిన్ని, మేకల శంకరరావు, హరి బాలాజీ, లింగాల సింహాచలం పాల్గొన్నారు.

సంబరాలు జరుపుతున్న వైసిపి నాయకులు